## క్లుప్తంగా

### సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



తాడేపల్లి రూరల్: ఈనెల 9వ తేదీన జరుగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు పల్లెకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో పారిశుద్ధ్య కార్మికులతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ నిర్వహించ తలపెట్టిన సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. కార్మిక వ్యతిరేక విధానాలను దేశ వ్యాప్తంగా కార్మికులు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల తాడేపల్లి మండల కార్యదర్శి డేవిడ్, జోజిబాబు, కార్మికులు రాంబాబు, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### నిత్యావసర సరుకులు పంపిణీ



పెదవడ్లపూడి(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పెదవడ్లపూడిలో సెయింట్ విన్సెంట్ దె పాల్ సొసైటీ ఆధ్వర్యంలో దత్తత కుటుంబాలకు నిత్యావసర సరకులను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫాదర్ శౌరిబాబు, సొసైటీ ప్రెసిడెంట్ పి.యేసు ప్రసాద్, ప్రతినిధులు అనిల్, పట్నా శ్రీను, సైమన్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

### ద్విచక్రవాహనంలో తాచుపాము

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కత్తుల పేటలో ఓ ద్విచక్రవాహనంలో తాచుపాము దూరి బుసలు కొట్టింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఓ యువకుడు తన ద్విచక్రవాహనం తీసుకువచ్చి ఇంటిముందు పార్క్ చేసి భోజనం చేసిన అనంతరం బయటకు వచ్చి చూడగా తాచుపాము బుసకొడుతున్నట్లు శబ్దం వచ్చింది. సదరు యువకుడు బండిని క్షుణ్ణంగా పరిశీలించగా పాము ఉందని గమనించి చుట్టుపక్కల వారిని పిలిచాడు. బండిలో ఉన్నపామును బయటకు తీసి కొట్టి చంపారు. ఆ పామును బండిలో నుంచి బయటకు తీయడానికి సుమారు గంట సమయం పట్టిందని స్థానికులు తెలిపారు.

### 28 శునకాలకు రేబిస్ టీకాలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో ఆదివారం ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి బి.సాల్మన్‌సింగ్ మాట్లాడుతూ ఈ టీకా ఏడాదికి ఓమారు వేయించాలని.. దానిద్వారా రేబిస్ వ్యాధి సోకకుండా ఉంటుందని.. రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. కుక్కకాటు ద్వారా రేబిస్ వ్యాధి సోకుతుందని దీనిద్వారా ఒక్కోసారి ప్రాణాలు పోయే పరిస్థితి ఎదురవుతుందన్నారు. అనంతరం 28 కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### ఆటోని ఢీకొట్టిన కారు



మందడం(తాడికొండ): ఆటోను కారు ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న 5 మంది ప్రయాణికులు గాయాలపాలైన ఘటన తుళ్లూరు మండలం మందడం సీడ్ యాక్సిస్ రోడ్డుపై ఆదివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట పరిధిలోని మురికిపూడి గ్రామానికి చెందిన భక్తులు ఆటోలో తాళ్లాయపాలెం శైవక్షేత్రం, వెంకటపాలెం టీటీడీ ఆలయానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మందడం సీడ్ యాక్సిస్ రోడ్డు వద్ద వేగంగా వస్తున్న కారు ఆటోను ఢీకొట్టడంతో ఆటో కాల్వలో పడి ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులకు గాయాలయ్యాయి. స్థానికులు సపర్యలు చేసి 108 వాహనం ద్వారా విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఫిరంగిపురం: ఆటో బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాతులూరు గ్రామానికి చెందిన దాసరి శ్రీను(45) ఓ ప్రయివేటు పాఠశాలలో బస్సు క్లీనర్‌గా పని చేస్తున్నాడు. మేరికపూడి గ్రామంలోని దర్గా వద్దకు తన స్నేహితులతో కలిసి శనివారం రాత్రి భోజనానికి వెళ్లారు. అనంతరం తన స్నేహితులతో కలిసి తిరిగి అర్ధరాత్రి వస్తుండగా పొలిమేర వద్ద ఎదురుగా వచ్చిన వ్యాన్ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడగా ఆటో నడుపుతున్న శ్రీను మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని నరసరావుపేటకు తీసుకువెళ్లగా శ్రీను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీను భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# చీటింగ్ మానిఫెస్టోతో బాబు పాలనకు చరమగీతం




కార్యక్రమంలో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు



సమావేశంలో పాల్గొన్న మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు

- మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట
- తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదు
- నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి టౌన్: సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రజలను చీటింగ్ చేసేలా మేనిఫెస్టో తీసుకువచ్చి నేడు అమలు చేయకపోవడంతో చంద్రబాబు పాలనకు చరమగీతం పాడేదిశగా ప్రజలు అడుగులు వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని అంజిరెడ్డి భవన్ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు మోసపూరిత మానిఫెస్టోను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి వివరించాలని సూచించారు. మోసపూరిత వాగ్దానాల కారణంగా ఏ కుటుంబానికి ఎంత నష్టం జరిగిందో.. ఎంతవరకు మోసపోయామనే విషయం ప్రజలకు తెలియజేయాలని కోరారు. ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని.. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. అనంతరం నాయకులతో కలిసి ఆయన క్యూ ఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరించారు. అంజిరెడ్డి భవన్ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తాడేపల్లి మండల రూరల్ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు సంకురు మరియబాబు, మండల విద్యార్థి విభాగ అధ్యక్షులు రాజేష్, మండల దివ్యాంగుల అధ్యక్షులు మన్న కుమార్ ఆంజనేయులు, మండల రైతు విభాగ అధ్యక్షులు మేకా ప్రభాకర్ రెడ్డి, మండల ఎస్టీ విభాగ అధ్యక్షులు బాణావత్ వెంకటేశ్వరరావు, మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

#### రాష్ట్రంలో అరాచక పాలన..



రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది. పోలీస్ వ్యవస్థతో పాటు అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు కూటమి ప్రభుత్వానికి కీలు బొమ్మల్లా మారారు. పసుపు చొక్కాల మాట వింటున్నారు గానీ న్యాయానికి తావులేదు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో జరిగిన వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం.

– బాజీ గంగాధరరావు, జిల్లా అధికార ప్రతినిధి

#### రాబోయేది మన ప్రభుత్వమే..



హామీలు నెరవేర్చిన జగనన్న ప్రజల గుండెల్లో గూడు కట్టుకుని ఉన్నారు. 2029 ఎన్నికల్లో రాబోయేది మన ప్రభుత్వమే. మండల, గ్రామ స్థాయి వరకు చంద్రబాబు చేసిన మోసాలను ఎండగడదాం. ఇంటింటికీ 'మంచి ప్రభుత్వం' పేరుతో వస్తున్న నాయకులను ప్రతి గ్రామంలోని ప్రజలు నిలదీసి, హామీలు నెరవేర్చి రావాలని డిమాండ్ చేయాలి.

– గోరా నాగ స్రవంతి, తాడేపల్లి మండల మహిళా అధ్యక్షురాలు

#### మానిఫెస్టో మరచిపోయారు..



ఎన్నికల సమయంలో ఇచ్చిన మానిఫెస్టోను టీడీపీ అధినేత చంద్రబాబు మరచిపోయారు. హైటెక్ అంటూ చెప్పే చంద్రబాబు వ్యవసాయం దండగ అని చెబుతూ వచ్చారు. అందుకే రైతులకు ఏమీ చేయలేకపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్, గిట్టుబాటు ధరలతో రైతులను ఆదుకుంది.

– అమరా వెంకట నాగేశ్వరరావు, తాడేపల్లి మండల అధ్యక్షులు

#### అన్ని వాగ్దానాలకు దగా..



2024 ఎన్నికల్లో ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం, దగా చేసి ఇబ్బంది పెడుతోంది. బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ పేరుతో ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలకు బాండ్లు ఇచ్చారు. అవి ఏమైపోయో వారికే తెలియాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించింది.

– దొంతిరెడ్డి చంద్రశేఖరరెడ్డి, యూత్ మండల అధ్యక్షులు

## బాబూ జగ్జీవన్ రామ్ సేవలు ఎనలేనివి

వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వజ్రబాబు

తాడికొండ: మాజీ ఉప ప్రధాని, వివిధ కేంద్ర మంత్రి పదవులలో 30 ఏళ్లపాటు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని సేవలందించిన బాబూ జగ్జీవన్ రామ్ చిరస్మరణీయులు అని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వనమా బాల వజ్రబాబు(డైమండ్) అన్నారు. ఆదివారం తాడికొండ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీహార్‌లోని వెనుక బడిన వర్గాల నుంచి రాజకీయాల్లోకి వచ్చి బాబూజీగా ప్రసిద్ధి చెందిన జగ్జీవన్ రామ్ 40 ఏళ్లపాటు రాజకీయాల్లో కేంద్ర మంత్రి పదవుల్లో కీలకంగా వెలుగొందారన్నారు. 1935లో అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన ఆలిండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. కార్యక్రమంలో తాడికొండ, తుళ్లూరు మండల పార్టీ అధ్యక్షులు ముప్పాళ్ల మనోహర్, మైనేని నాగమల్లేశ్వరావు, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షులు దాసరి రాజు, జిల్లా కార్యదర్శి కొప్పుల శేషగిరిరావు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు చుండు వెంకటరెడ్డి, ఆరేపల్లి జోజి, తాడికొండ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గుంటి రఘువరన్, తాడికొండ గ్రామ పార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి, డీజే శ్రీనివాసరావు, కె.రవికుమార్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుగ్గిరాల: భారత ఉప ప్రధాని డా.బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని దుగ్గిరాల మండలంలో ఆదివారం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఆయన విగ్రహానికి మండల తెదేపా మహిళా అధ్యక్షురాలు కేసంనేని శ్రీ అనిత పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వి.కృష్ణ ప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీని మంత్రి లోకేష్ విస్మరించారు



కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఎన్నికలకు ముందు ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఇచ్చిన హామీని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మరిచారని సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారంతో 215వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలిసి సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల విషయంలో జోక్యం చేసుకుని వారికి రావాల్సిన బకాయిలను ఇప్పించాలని కోరుతున్నామన్నారు. మంత్రి లోకేష్ కార్మికుల సమస్యపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆశీర్వాదం, గురవయ్య, కార్మికులు సాంబయ్య, నాగేశ్వరరావు, సుబ్బారావు, ఇస్మాయిల్, నవనీతం తదితరులు పాల్గొన్నారు.

## కార్మెల్‌మాత పవిత్ర జెండాల ప్రతిష్ట



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై గల కార్మెల్ మాత ఆలయంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు బాల ఏసుదేవాలయ విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి ఆదివారం తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా ప్రారంభ సూచికగా పవిత్ర జెండాలను బాల ఏసుదేవాలయంలో ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మేళతాళాలతో ఊరేగింపుగా కార్మెల్ కొండ వరకు వచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఉంచి ప్రత్యేక దివ్యపూజా, బలిపూజలు నిర్వహించి జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గురువులు, మఠకన్యాస్త్రీలు, గుడిపెద్దలు, కథోలిక క్రైస్తవులు పాల్గొన్నారు.

**విశ్వాసులకు భోజనం అందజేత..**

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రాజాపేటలో ఆదివారం కార్మెల్ కొండకు వచ్చే విశ్వాసులకు భోజనం అందజేశారు. అనేక ప్రాంతాల నుంచి భక్తులు కార్మెల్ కొండను ఎక్కేందుకు వస్తుండటంతో వారికి మధ్యాహ్నం భోజనం అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఆదివారం భక్తులకు ఇటువంటి సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బదనాథం తామసు, సతీష్‌కుమార్, దేశం అంజిరెడ్డి, రామిశెట్టి, బాలస్వామి, గోపు రెడ్డిలు పాల్గొన్నారు.

## ఘనంగా గంగానమ్మ జాతర



జాతరలో పాల్గొన్న భక్తులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బోసుబొమ్మ సెంటర్ వాటర్ ట్యాంక్ వద్ద గల గంగానమ్మ ఆలయంలో ఆదివారం గ్రామస్తులు, రైతులు అంగరంగ వైభవంగా శ్రీ గంగానమ్మ పోతురాజు, మహాలక్ష్మి కమిటీ ఆధ్వర్యంలో జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఏటా అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం వర్షాలు బాగా కురవాలని, రైతులకు పంటలు బాగా పండాలని ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం గంగానమ్మ అమ్మవారికి మంగళస్నానం, పసుపు కుంకుమ, నైవేద్యం సమర్పణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పార్టీ పటిష్టతకు నాయకులు కష్టపడి పని చేయాలి

పొన్నెకల్లు(తాడికొండ): పార్టీ పటిష్టతకు నాయకులు కష్టపడి పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. పొన్నెకల్లు గ్రామంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సీపీఐ శాఖ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కమ్యూనిస్టుల కంచుకోట పొన్నెకల్లు అని కొనియాడారు. నాయకులు ప్రజల్లో ఉండాలని.. తాడికొండ అడ్డరోడ్డులోని పున్నమ్మ చెరువు విషయంపై సీఎం చంద్రబాబుతో చర్చించామని.. త్వరలో పున్నమ్మ చెరువుపై విచారణ జరుగుతుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ.. పేదల పక్షాన సీపీఐ అనేక పోరాటాలు నిర్వహించి విజయం సాధించిందని అన్నారు. ఆగస్టులో జరిగే జిల్లా, రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కాటోతు ఈశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివ శంకరరావు, గ్రామ కార్యదర్శి రామినేని రామారావు, కోటా ఉమా మహేశ్వరరావు, రేపూడి శ్రీనివాసరావు, కంభంపాటి దేవుని దయ, దామినేని పద్మారావు కోట భూపతి పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

### • వైభవంగా శయన ఏకాదశి పూజలు



113.తాళ్లూరులోని వేణుగోపాల స్వామి

ఫిరంగిపురం మండలంలోని పలు ఆలయాలల్లో ఆదివారం శయన ఏకాదశి పూజలను వైభవంగా నిర్వహించారు. ఫిరంగిపురంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివార్లకు అర్చకులు వంశీకృష్ణ విశేష పూజలు చేశారు. గ్రామంలోని కోదండ రామ స్వామి ఆలయం.. నగరేశ్వర స్వామివార్లకు అర్చకులు రాజేంద్రశర్మ విశేష పూజలు నిర్వహించారు. 113.తాళ్లూరు గ్రామంలోని వేణుగోపాల స్వామివార్లకు అర్చకులు ప్రసన్నమూర్తి అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. వేమవరంలోని కోటిలింగాల క్షేత్రంలో స్వామివార్లకు విశేష అభిషేకాలు, పూజలు చేశారు. మరకత లింగానికి భక్తులు స్వహస్తాలతో విశేష అర్చనలు చేసి క్షీరాభిషేకాలు నిర్వహించారు.

– ఫిరంగిపురం

## గురు పూజకు శ్రీ కృష్ణుడిని ఆరాధించాలి



భగవద్గీత ప్రచారంలో పాల్గొన్న సభ్యులు

దుగ్గిరాల: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారు రచించిన 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలు, భగవద్గీత ప్రచారాలను నిర్వహించారు. దుగ్గిరాల మండలంలోని చినపాలెంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక అధ్యక్షులు రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. శ్రీ కృష్ణుడిని, భగవద్గీతని విశ్వసించడం వల్ల జ్ఞానం, మోక్షం లభిస్తాయని తెలిపారు. జులై 10వ తేదీన గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ కృష్ణ భగవానుడిని ఆరాధించాలని తెలిపారు. కార్యక్రమంలో టి.వి.కృష్ణా రావు, ఆర్.రామకృష్ణ, బి.శివలింగం నాయక్, టి.బ్రహ్మం, బి.రామోజీ నాయక్, హరిబాబు, ఫణిదరం శివ, దిల్షా, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఏకలవ్యుని జయంతి

దుగ్గిరాల: ఏకలవ్యుని జయంతిని దుగ్గిరాలలోని రైలుపేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏకలవ్యుని గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో పసుపు యార్డు చైర్మన్ ఝాన్సీ ఉన్నం, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## ఎయిమ్స్‌లో రోగుల పరిస్థితి దయనీయం

ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ఉంటేనే చికిత్స!

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఆల్ ఇండియా మెడికల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఎయిమ్స్)లో రోగుల పరిస్థితి ఘోరంగా మారిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ లేకుంటే వైద్య సేవలు, మందులు అందజేయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నటరాజన్ ఏఆర్ సర్క్యులర్ జారీ చేయడంపై రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ఉంటేనే చికిత్స, మందుల సరఫరా ఉంటుందని.. లేదంటే ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స చేయించుకోవాలని సర్క్యులర్ మంజూరు కావడంపై రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆసుపత్రిలో వివరణ కోరగా ప్రస్తుతం బీపీఎల్ కార్డు ఉన్న వారందరికీ ఉచితంగా చికిత్స, మందులు అందజేస్తున్నామని అన్నారు. ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎలాంటి నిబంధనలు అమలులో ఉన్నాయో.. మంగళగిరి ఎయిమ్స్‌లోనూ అవే నిబంధనలు పాటిస్తున్నట్లు తెలిపారు. రోగులకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అత్యధికంగా ఖర్చు అయ్యే చికిత్సతో పాటు మందులు కొనుగోలు చేసుకోవాలని బీపీఎల్ లేని వారికి సూచించడం జరుగుతుందన్నారు.

## రెండో దశ భూ సమీకరణపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత

ఫణిదరం(తాడికొండ): రాజధాని అభివృద్ధి పేరుతో ప్రభుత్వం చేపడుతున్న రెండో దశ భూ సమీకరణపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు, ఈమని అప్పారావులు అన్నారు. ఆదివారం తాడికొండ మండలం ఫణిదరం, దామరపల్లి, గరికపాడు, బండారుపల్లి గ్రామాల్లో ప్రజా సంఘాల నాయకులతో కలిసి వారు పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు, వ్యవసాయ కార్మికులతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. రాజధాని నిర్మాణానికి మరో 44 వేల ఎకరాల భూ సమీకరణకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో సభలు నిర్వహించిందని.. దీనికి 70 శాతం మంది రైతులు భూములిచ్చేందుకు నిరాకరించారని తెలిపారు. గ్రామాల్లో చిన్న సన్నకారు రైతులు ఉన్నారని, దీనికి తోడు మరికొంత భూమి కౌలుకు తీసుకుని జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు ప్రభుత్వం ఆ భూమిని తీసుకుంటే తాము ఎలా బ్రతకాలని ప్రశ్నిస్తున్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, వై.కృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

### కేంద్రంలో చంద్రబాబుది ప్రేక్షక పాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

మంగళగిరి టౌన్: కేంద్రంలో చంద్రబాబు పాత్ర కేవలం ప్రేక్షక పాత్రే అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ మహాసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేశారే తప్పా.. ఎటువంటి అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆదానీ, కార్పొరేట్ సంస్థలకు దాసోహం అవుతోందని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మోదీ, అమిత్‌షా జోడీలు దేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తూ కార్పొరేట్‌లకు దాసోహం అవుతూ ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, నాయకులు బాపనపల్లి వెంకటేశ్వరరావు, చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### సమ్మెకు కార్మికులు తరలి రావాలి



దుగ్గిరాల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేస్తోందని సీపీఎం కార్మిక మండల నాయకులు జెట్టి బాలరాజు అన్నారు. దుగ్గిరాలలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. బాలరాజు మాట్లాడుతూ.. 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులు, ఆశా వర్కర్లు, భవన నిర్మాణ కార్మికులు సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు షేక్.సుభాని, వై.బ్రమ్మేశ్వరరావు, ఎం.నాగమల్లేశ్వర రావు, బి.అమ్మి రెడ్డి, ఎస్.సుబ్బారావు పాల్గొన్నారు.

### కనులపండువగా ఉరుసు ఉత్సవాలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని నులకపేటలో నాగులు మీరా పీర్లపంజా కమిటీ ఆధ్వర్యంలో ఉరుసు ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. దర్గాలోని పీర్లపంజా వద్ద గంధం చల్లడం, పుష్పగుచ్ఛాలు సమర్పించడం, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి యం.ఎస్.బేగ్, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, మైనార్టీ సెల్ అధ్యక్షులు చాంద్ బాషా, కమిటీ సభ్యులు ఇలియాజ్, శ్రీను, ఖాసిం సాహెబ్, దుబాయి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

### కూరగాయలతో శ్రీహరికి అలంకరణ



దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డు సమీపంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారిని తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం కూరగాయలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణాలు, ధ్వజ స్తంభాలను నిర్వాహకులు సుందరంగా అలంకరించారు. దుగ్గిరాలలోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ నాగేశ్వర స్వామి వారి దేవస్థానంలోని అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.